ప్రజాశక్తి

శనివారం 7 డిసెంబర్ 2024



కాలం చెల్లిన మాత్రలు ఉన్న బాక్సు

విద్యుత్ బిల్లుల మోత...!

- ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల బాదుడు
- వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం
- డిసెంబర్ బిల్లులో రూ.150 నుంచి రూ.350 వరకూ పెరుగుదల
- వినియోగదారులు విలవిల
- జనవరి నుంచి మరో బాదుడుకు రంగం సిద్ధం

పట్టణంలోని ఆర్‌టిసి కాలనీలో మహబూబ్‌దౌల అనే విశ్రాంత ఉద్యోగి నివాసం ఉంటున్నారు. ఇతనికి వచ్చే పెన్షన్ పైనే కుటుంబం ఆధారపడింది. గత నెల కరెంటు బిల్లు కన్న ఈ నెల బిల్లు రూ.220 అదనంగా పెరిగింది. బిల్లును చూసి మహబూబ్‌దౌలా షాక్‌కు గురయ్యాడు.

హిందూపురం రూరల్ మండలం చౌళూరు గ్రామంలో నివాసం ఉంటున్న రవి కుమార్ అనే వ్యక్తి తూమకుంట పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతనికి వచ్చే అరకొర వేతనంతో కుటుంబాన్ని నెట్టుకువస్తున్నాడు. గత నెల కరెంటు బిల్లుతో పోల్చితే ఈ నెల రూ.160 వరకు అదనంగా పెరిగింది.

ఇలా వీరిద్దరే కాదు బడుగు, బలహీన నిరుపేదలు ఈ నెల తమకు వచ్చిన విద్యుత్ బిల్లులను చూసి ఖంగుతిన్నారు. విద్యుత్‌ను కాదు బిల్లును ముట్టుకుంటేనే షాక్ కొడుతోందని వారు వాపోతున్నారు.

అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచం...అవసరమైతే తగ్గిస్తాం అంటు ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఊదర గొట్టారు. అయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇందన సర్దుబాటు పేరుతో వచ్చే రెండు సంవత్సరాల్లో సుమారు రూ.350 కోట్ల దాకా అదనంగా దండు కోవడానికి రంగం సిద్ధం చేశారు.

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజాశక్తి-హిందూపురం

విద్యుత్ బిల్లులు చూసి జనం షాక్‌కు గురవుతున్నారు. ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం జనంపై పెనుభారం మోపింది. గత నెల బిల్లుకంటే విద్యుత్ వాడకాన్ని బట్టి ఈనెల రూ.150 నుంచి రూ.350 వరకూ అదనంగా వచ్చింది. డిసెంబర్ రెండో తేదీ నుంచి విద్యుత్ శాఖ కరెంటు బిల్లులు తీస్తోంది. ఆ బిల్లులు చూసి సామాన్యులు హడలిపోతున్నారు. అప్పుడు వైసిపి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమపై విద్యుత్ భారాలు మోపుతున్నాయని విమర్శిస్తున్నారు. గతేడాది వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం ప్రజలపై ట్రూ అప్, సర్దుబాటు భారం మోపింది. డిసెంబర్‌లో ఇస్తున్న బిల్లుల నుంచి ఈ బాదుడు మొదలుపెట్టింది. జనవరిలో అదనంగా మరో ఛార్జీ మోతకు ఇప్పటికే అన్నీ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దీంతో జనానికి ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపు 13 లక్షలకు పైగా గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానివే. రెక్కాడితేగాని, డొక్కాడని కుటుంబాలు అనేకం ఉన్నాయి. విద్యుత్ బిల్లుల పేరుతో ప్రభుత్వాలు జనాన్ని పీక్కుతింటున్నాయి. వాడుకున్న కరెంటుకు కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ఇడి, సర్‌ఛార్జి, ఇడి ఐఎన్‌టి, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ 2 ఛార్జీల పేరుతో వీర బాదుడు బాదుతోంది. హిందూపురం పట్టణంలో ఓ మధ్యతరగతి కుటుంబం నవంబర్‌లో 178 యూనిట్లు కరెంటు వాడుకోగా రూ.735 వచ్చింది. వాడుకుంటున్న కరెంటుకు కాకుండా అదనపు ఛార్జీల కింద మరో రూ.360 వేయడంతో విద్యుత్ బిల్లు రూ.1095 వచ్చింది. వచ్చిన కరెంటు బిల్లును మూడొంతులుగా విభజిస్తే అందులో ఒకవంతు అదనపు ఛార్జీల భారమే ఉండటంతో ఆ కుటుంబం లబోదిబోమంటోంది. వాడుకున్న కరెంటుకు, వస్తున్న బిల్లుకు సంబంధం లేకుండాపోయిందని ప్రజలు వాపోతున్నారు. శీతాకాలంలో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. ఇప్పుడు ఇంత పెద్ద మొత్తంలో బిల్లు వస్తే వేసవిలో పరిస్థితి ఏమిటనే భయం అందరినీ వెంటాడుతోంది. చిరువ్యాపారులు సైతం కరెంటు బిల్లులు చూసి గుండెలు బాదుకుంటున్నారు. విద్యుత్ భారాల విషయంలో ప్రభుత్వం తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీల పెంపుదలపై అప్పటి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన టిడిపి, బిజెపి, జనసేన ఇప్పుడు కూటమి కింద అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత దారుణంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారంలోకి వచ్చాక మరోలా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయనే చర్చ జనాల్లో సాగుతోంది.

ఆదాయం అంతంత మాత్రం.. ధరలు మాత్రం ఆకాశంలో..

సామాన్య ప్రజానీకం ఆదాయాల్లో మాత్రం పెరుగుదల ఉండటం లేదు. నిత్యావసర వస్తువుల నుంచి కూరగాయల ధరలు వరకూ అన్నింటి ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటేసిన పరిస్థితి ఉంది. కందిపప్పు, మినపప్పు వంటి ధరలు కిలో దాదాపు రూ.180 వరకూ పలుకుతున్నాయి. వంటనూనె కిలో రూ.140కుపైనే ఉంది. ఉల్లిపాయలు కిలో రూ.50కిపైనే పలుకుతున్నాయి. ఇతర కూరగాయల ధరలు కిలో రూ.40 నుంచి రూ.80 వరకూ పెరిగిన పరిస్థితి ఉంది. మరోపక్క విద్యుత్ ఛార్జీల పెంపుతో సామాన్య ప్రజానీకం విలవిల్లాడుతోంది. పెను భారాలు మోపుతూ పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై జనాగ్రహం పెల్లుబికుతోంది. వైసిపి ఓటమికి ప్రధాన కారణం తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచడమే. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అదనపు ఛార్జీల పేరుతో రెండు సార్లు విద్యుత్ ఛార్జీల మోత మోగించింది. దీంతో కూటమి ప్రభుత్వంపై జనాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.


CALL 1912
CUSTOMER CARE 24/7
APSPDCL
Demand / Disconnection notice
(As per APERC Reg No.5 of 2004)

CIRCLE	ANANTHAPUR
BILL DATE	06-12-24 11:09
BILL NO	73118061211094011224
NAME	KRISHNA MURTHY D
USC NO	7311101017597
Aadhar Number	XXXXXXXX7680
Mobile Number	XXXXXX2227
SECTION	HINDUPUR-D1
Bill Method	IrDA
METER NO	34724847
Meter Type	IRDA
DTR Code	307311130021
POS	DOMESTIC (A)
CAT:LT1 SUB CAT:0 PH :1	
CONTRACTED LOAD	.99
BILL PERIOD	06.12.24 06.11.24

	PRESENT	PREVIOUS
MTR STATUS	01	01
KWH	8642.0	8464
KVAH	0	0
SOLAR	0.0	0
OLD MTR KWH		0
OLD MTR KVAH		0

BILLED UNITS	178.0/0.0
AVERAGE UNITS	215
SOLAR UNITS	0.0
NET UNITS :	178.0
RECORDED M.D : 1.0	MF :1
MIN/ENERGY CHRGS	735.00
FIXED CHARGES	10.00
CUSTOMER CHARGES	50.00
ELECTRICITY DUTY	10.68
FPPCA(2022_04)	92.28
FPPCA(2024_10)	93.20
INTEREST ON ED	0.01
SURCHARGE	25.00
OTHER CHARGES	0.00
ADJUSTMENTS	0.00
TrueUp Charges(29/36)	79.16
AP GOVT SUBSIDY	0.00
Loss/Gain (+ / -)	-0.33
BILL AMT	Rs.1095.00
ARREARS	0.00
TOTAL DUE	Rs.1095.00
AGL Demand	0.00
ACD Amount	0.00
Development Charges	0.00
DUE DATE	21-Dec-2024
DISCONNECTION DATE	06-Jan-2025
LAST PAID :1359 on 28-11-2024	
SD Available	100.00
AEE Contact	9440813294

Make Digitalpaymentusing Web/Mobileapp

క్రిష్ణమూర్తి అనే వ్యక్తికి వచ్చిన కరెంటు బిల్లు

ఒక్కసారిగా బిల్లు రూ.220 పెరిగింది

గత నెల విద్యుత్ బిల్లుకంటే డిసెంబర్ నెలలో తీసిన విద్యుత్ బిల్లు రూ.220 ఎక్కువ వచ్చింది. ఒక్కసారిగా అంత పెరిగితే మధ్యతరగతి కుటుంబాలు ఏవిధంగా భరిస్తాయి. కరెంటు బిల్లు విషయంలో మాలాంటి మధ్యతరగతి కుటుంబాలు నలిగిపోతున్నాయి.

మహబూబ్ దౌలా ,
వినియోగదారుడు, హిందూపురం

అదనపు ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

అదనపు ఛార్జీలు భరించలేకపోతున్నాం. వాడుకున్న కరెంటు కంటే అదనపు ఛార్జీల భారంతో నలిగిపోతున్నాం. అనేక ఛార్జీల పేరుతో భారం వేస్తున్నారు. గత నెల బిల్లుకంటే ఈ నెల బిల్లులో రూ.160 వరకూ అదనపు ఛార్జీల భారం పడింది. అదనపు ఛార్జీలు భరించలేని స్థాయికి చేరాయి. ప్రభుత్వాలు మారినా భారాలు మాత్రం తగ్గలేదు. ఇలాగైతే సామాన్యులు ఎలా బతకాలో ప్రభుత్వమే చెప్పాలి.

రవి కుమార్,
వినియోగదారుడు, చౌళూరు

వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం

వైసిపి బాటలోనే కూటమి ప్రభుత్వం పయనిస్తోంది. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పేరుతో అడ్డంగా దోచుకుంటోంది. దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలి.

ఇనాయతుల్లా
కాంగ్రెస్‌పార్టీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు

సర్దుబాటు పేరుతో దోపిడీ

కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు పేరుతో జనాన్ని దోచుకోవడం తగదు. ప్రతి పక్షంలో ఉన్న సమయంలో విద్యుత్ ఛార్జీలపై బాదుడే బాదుడు కార్యక్రమం చేపట్టి, అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం కన్నా అదనంగా విద్యుత్ ఛార్జీలు బాదుతున్నారు. వెంటనే వీటిని ఉపసంహరించుకోవాలి. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం

ఇఎస్. వెంకటేష్
సిఐటియు సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి

కాలం చెల్లిన మాత్రలు మింగి మహిళకు అస్వస్థత

పరిస్థితి విషమం
బెంగుళూరుకు తరలింపు

ప్రజాశక్తి-హిందూపురం

కాలం చెల్లిన మాత్రలు మింగిన మహిళ అస్వస్థతకు గురైంది. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో బంధువులు బెంగుళూరుకు తరలించారు. హిందూపురం పట్టణంలో చోటు చేసుకున్న ఈఘటనకు సంబంధించిన వివరాలు...

హిందూపురం పట్టణంలో నివాసం ఉంటున్న అంగన్వాడీ కార్యకర్త తహసీన్‌బాను తీవ్ర తలనొప్పితో బాధ పడుతు గురువారం రాత్రి స్థానిక షానవాజ్ అసుపత్రికి వెళ్లింది. అక్కడ ఉన్న వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఇంజక్షన్ తో పాటు ఒక సెలైన్ బాటల్ ఎక్కించారు. కొద్ది సేపటికి ఆమె కొలుకోంది. దీంతో వైద్యులు మందులను రాసి వాటిని వాడాలని సూచించారు. దీంతో అక్కడే ఉన్న అనిల్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌లో మహిళ మందులను తీసుకుంది. వారిచ్చిన మాత్రలను వేసుకున్న మహిళకు కొద్దిసేపటికే వాంతులు అయ్యాయి. వెంటనే స్పృహతప్పి పడిపోయింది. దీంతో బంధువులు మెడికల్ షాపు వారు ఇచ్చిన మందులను పరిశీలించారు. వారిచ్చిన మందులు కాలం చెల్లిన మందులుగా గుర్తించారు. వెంటనే వైద్యులను సంప్రదించారు. మందులు చూసిన వైద్యులు వీటిని ఎవరు ఇచ్చారని అడిగారు. పక్కనే ఉన్న అనిల్ మెడికల్ షాపులో తీసుకున్నట్లు తెలిపారు. ఇంతలో మహిళ ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం ఆమెను బెంగళూరుకు తరలించారు.

యథేచ్ఛగా కాలంచెల్లిన మందుల విక్రయం

హిందూపురం పట్టణంలో ఉన్న మెడికల్ షాప్ నిర్వాహకులు జనరిక్ మందులను బ్రాండెడ్‌గా విక్రయించడమే కాదు కాలం చెల్లిన మందులను విక్రయిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన ఔషధ నియంత్రణ అధికారులు మెడికల్ మాఫీయా ఇచ్చే ముడుపుల మత్తులో తూగుతున్నారే తప్ప చర్యలు మాత్రం తీసుకోవడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న వారు వైద్య సేవల కోసం వెళ్లి, వందలాది రూపాయలు డాక్టర్ ఫీజు చెల్లించి, వేలాది రూపాయాలు వెచ్చించి తీసుకున్న మందులు తీసుకుంటున్నారు. అయితే పలు దుకాణాల్లో కాలం చెల్లిన మందులను విక్రయిస్తున్నారు. దీనిపై ఎప్పటికప్పుడు తనఖీలు నిర్వహించాల్సిన ఔషధ నియంత్రణ అధికారులు నామ మాత్రంగా సైతం తనఖీలు చేపట్టడం లేదు. దీంతో హిందూపురంలో మెడికల్ షాపు నిర్వహకులు వారికి ఇష్టం వచ్చిన విధంగా కాలం చెల్లిన మందులను విక్రయిస్తు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్నారు. ఇప్పటికైన ఔషధ నియంత్రణ అధికారులు మేల్కొని మెడికల్ షాపులపై తనిఖీలు నిర్వహించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకూ పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పదో సీనియర్స్ ఎపి బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్‌బాల్ జట్లకు పట్టణానికి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. పురుషుల జట్టుకు సంజయ్, మహిళల జట్టుకు జి.కిరణ్మయి, బి.నీఖ్యశ్రీ ఎంపికయ్యారని ధర్మాంబ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రా రెడ్డి తెలిపారు. నవంబర్ 24వ తేదీ అనంతపురంలో జరిగిన సెలక్షన్స్‌లో వీరు ప్రతిభ చూపి జిల్లా జట్లకు ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ తుల్లా, హర్షం వ్యక్తం చేశారు.

ఉషశ్రీ ఆధ్వర్యంలో 'గుడ్ మార్నింగ్'

ప్రజాశక్తి-సోమందేపల్లి

గ్రామంలో పర్యటిస్తున్న ఉషశ్రీ చరణ్, తదితరులు

పెనుకొండ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఉషశ్రీ శుక్రవారం సోమందేపల్లిలో గుడ్ మార్నింగ్ కార్యక్రమం చేపట్టారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. స్థానిక వాల్మీకి సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, పెద్దమ్మ గుడి వద్ద ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకున్నారు. ఆమె వెంట పార్టీ మండల కన్వీనర్ గజేంద్ర, టౌన్ కన్వీనర్ గోవిందమ్మ గారి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రమాకాంత్ రెడ్డి, జడ్పిటిసి డిసి అశోక్, ఉపాధ్యక్షుడు మంజు, సర్పంచులు గంగాదేవి నరసింహమూర్తి, అంజినాయక్, ఈశ్వర్, గుడిపల్లి కళ్యాణ్, సూర్యప్రతాపరెడ్డి ఉన్నారు.

పక్కా కమర్షియల్ సర్వే స్కెచ్ ...

వివాదాలకు కేంద్ర బిందువు ఆ సర్వేయర్
పనిచేసిన ప్రతిచోటా వివాదాలే..
చేయి తడిపితేనే కొలతలు..
గ్రీవెన్స్‌లో ఫిర్యాదులొచ్చినా పట్టించుకోని వైనం...

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆయన ఓ ప్రభుత్వ ఉద్యోగి. బాధ్యతగా ప్రజల కోసం పనిచేయడానికి ప్రభుత్వం నుంచి వేలాది రూపాయలు జీతభత్యాలు తీసుకుంటారు. రైతుల కోసం బాధ్యతగా పనిచేయాల్సిన ఆ సర్వేయర్ పక్కా స్కెచ్‌తో వసూలుకు పాల్పతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫీల్డ్ పేరుతో కార్యాలయానికి రాకుండా రైతులను ఆఫీసుచుట్టూ తిప్పించుకుంటాడన్న విమర్శలు ఉన్నాయి. వివాదాలకు కేంద్ర బింధువుగా ఉన్న ఆ అధికారి పైసలు ముట్టజెప్పనిదే పనిచేయడన్న ఆరోపణలున్నాయి. ఆయన పనిచేసిన ప్రతిచోటా వివాదాస్పద అధికారిగా పేరుతెచ్చుకున్నట్లు తెలుస్తోంది.

కదిరి మండలకేంద్రంలో పనిచేస్తున్న సర్వేయర్ వ్యహార శైలిపై పలు ఆరోపణలు వినపడుతున్నాయి. అన్నదమ్ములు, కమర్షియల్, ప్రభుత్వ భూములకు సంబంధించి హద్దులు, కొలతలు ,ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా కాపాడటంలో రెవిన్యూ శాఖలో కీలక పాత్ర సర్వేయర్‌ది. అలాంటి సర్వేయర్ విధులు పట్ల అలసత్వం ప్రదర్శిస్తూ అందినకాడికి దండుకుంటున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. సమర్పించుకుంటే తప్ప కొలతలు వేయడన్న విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ఆయన ఎక్కడ పనిచేసిన వివాదాలకు కేంద్ర బిందువుగా మారినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఉద్యోగి విధులలో చేరినప్పటి నుండి నేటి వరకూ ప్రజలు మొదలు రెవిన్యూ ఉద్యోగులు వరకు అంతా వివాదాస్పద అధికారిగానే పరిగణిస్తారు. దీన్ని బట్టిచూస్తే ఆయన భాగోతం ఏపాటిదో అర్థమవుతుంది. అనంతపురం జిల్లాలో ఓ మండల కేంద్రంలో పనిచేసిన చోట అప్పట్లో కార్యాలయంలో ఏకంగా డిప్యూటీ తహశీల్దార్‌తోనే బాహాబాహీకి దిగినట్లు సమాచారం. ప్రస్తుతం కదిరి ప్రాంతానికి సమీపంలో ఉన్న ఓ గ్రామ పంచాయితీలో ప్రభుత్వ అసైన్మెంట్ భూమికి స్కెచ్,కొలతలు వేస్తానని నమ్మబలికి కొందరు రైతుల నుండి డబ్బులు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే కదిరి మండల కేంద్ర సమీపాన 705 సర్వే నెంబర్ లో సంబంధిత భూమి యజమానులకు తెలియకుండా పక్క వారితో కుమ్మక్కై ఆ భూమికి సంబంధించి సబ్ డివిజన్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో సంబంధిత యజమానికి విషయం తెలియడంతో ఆ సర్వేయర్ భాగోతం పై డివిజనల్ స్థాయి అధికారికి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసి అలాగే సబ్ డివిజన్ రద్దు చేయాలని కోరినట్లు తెలుస్తోంది. దీంతో డివిజనల్ అధికారి ఆ సర్వేయర్ నీ పిలిపించి వివరణ అడగగా ఆ సర్వేయర్ మరో ఉన్నతాధికారిపై నెపాన్నినెట్టివేసి తప్పించుకోవాలని చూసినట్లు తెలుస్తోంది. సదరు ఉన్నతాధికారి స్పందించి 'నీవిచ్చిన రిపోర్ట్ ఆధారంగా సంతకం చేసాను నా పాత్ర ఏముంద'ని నిలదీసినట్లు సమాచారం. అదేవిధంగా సర్వే నెంబర్ 301 లో హద్దులు, కొలతలు కోసం సదరు సర్వేయర్‌ని ఓ రైతు సంప్రదిస్తే భారీమొత్తంలో డబ్బు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా పేద ప్రజలు తమ భూములకు సంబంధించి హద్దులు, కొలతలు వేయించే విషయంపై కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఆయన జాడ కన్పించందని ఉన్నా ఏదో ఒక కారణం చెప్పి పంపుతాడన్న విమర్శలు ఉన్నాయి. సర్వేయర్ వ్యవహారంపై పలువురు రైతులు ప్రజలు ఉన్నతాధికారులకు గ్రీవెన్సులో ఫిర్యాదు చేసినా ఫలితం కన్పించడం లేదని స్థానికులు వాపోతున్నారు. తామిచ్చిన ఫిర్యాదులకు ఉన్నతాధికారులు గతంలో మెమోలు తో పాటు చర్యలకు ఉపక్రమించి ఉత్తర్వులు జారీ చేసి అనంతరం మిన్నకుండి పోయారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వేయర్ పనితీరును మార్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరుతున్నారు.


TAHSILDAR OFFICE
URGENT 5 - NOV 2024
(Time line: One week)

From
Sri.V.V.S.Sarma,M.Sc.,B.Ed.,H.D.C.M,
Revenue Divisional Officer,
Kadiri.

To
The Tahsildar,
Kadiri.

Rc.No.342/2024/B1, Dt: 04.11.2024

Sub: ROR – Sri Sathya Sai District – Kadiri division – Kadiri mandal – Kadiri Rural – Sy.No.705, Extent Ac. 1.50 cents out of Ac.4.49 Cents – Sri T.Saleem s/o T.Abdul Rasool of Kadiri Mandal – Enquiry Report Called for – Requested – Regarding.

Ref: Representation of Sri T.Saleem s/o T.Abdul Rasool of Kadiri Mandal, Dt:21.10.2024.

@@@

I invite your attention to the reference cited above, one Sri T.Saleem s/o T.Abdul Rasool of Kadiri Mandal requested to cancel the Sub division record and again to survey the Sub division in respect of Sy.No. 705, Extent Ac. 1.50 cents out of Ac.4.49 Cents of Kadiri Rural of Kadiri mandal.

Hence I request you to enquire into the matter along with Mandal Surveyor and take necessary action and submit the action taken report to this office at an early date.The Representation is enclosed herewith for taking necessary action.

Yours faithfully,
Sd/- V.V.S.Sarma,
Revenue Divisional Officer,
Kadiri.

//true copy//

Divisional Administrative Officer (FAC)

Copy to Sri T.Saleem s/o T.Abdul Rasool of Kadiri Mandal.

ఆర్డీవోకు రైతు ఇచ్చిన ఫిర్యాదుపై తహశీల్దార్‌కు పంపిన నోటీసు

45 రోజుల్లో భూ సమస్యలకు పరిష్కారం

రెవెన్యూ సదస్సులో మంత్రి సవిత

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-సోమందేపల్లి

రెవెన్యూ సదస్సుల ద్వారా 45 రోజుల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్ శాఖామంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం పెనుగొండ నియోజకవర్గంలోని సోమందేపల్లి మండలంలోని నాగి నాయిని చెరువు గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల భవనం ఆవరణలో గ్రామంలో రెవెన్యూ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామసభ వద్ద ఏర్పాటు చేసిన అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, రెవెన్యూ శాశ్వత రికార్డుల కౌంటర్లను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రెవెన్యూ సదస్సులు, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు, వివాదాల పరిష్కారమే అజెండాగా, రెవెన్యూ సదస్సుల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే ప్రక్రియలో పలు లోపాలు చోటుచేసుకున్నాయని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సరైన విధానం, మార్గదర్శకాలు లేకుండా, తగిన సమయం ఇవ్వకుండా హడావిడిగా సర్వే చేయించారని అన్నారు. రీసర్వేలో జరిగిన లోపాలపై సుమారు కొన్ని వేలాది దరఖాస్తులు రావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. గత ప్రభుత్వంలో సర్పంచులకు నిధులు కూడా లేకుండా పోయాయన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి సర్పంచులకు అధిక ప్రాధాన్యతతను ఇస్తూ ప్రతి పంచాయతీకి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సచివాల సిబ్బంది కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రజలకు అందజేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ పూర్తిగా ఉచితంగా పొందవచ్చునని, ప్రజలు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 70 శాతానికి పైగా అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం, సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లా అధికారులు, డిప్యుటీ కలెక్టర్లతోపాటు అన్ని శాఖల అధికారులను సదస్సులవద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు. వచ్చిన అర్జీలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరిస్తామని చెప్పారు.రోజుకో గ్రామం చొప్పున మొత్తం 33 రోజులపాటు సదస్సులను నిర్వహించేందుకు షెడ్యూల్‌ను రూపొందించామని తెలిపారు. ప్రతీ అర్జీకి రసీదును అందజేస్తామని అన్నారు. చిన్న సమస్యపైన కూడా అర్జీ అందజేయవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఆర్డీవో ఆనంద్, మండల స్పెషల్ ఆఫీసర్ అశ్వర్థ నాయక్, తహశీల్దార్ రెడ్డి శేఖర్, ఎంపీడీవో మమతా దేవి, మండల కన్వీనర్ సిద్ద లింగప్ప, రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ డివి ఆంజనేయులు, సర్పంచి అంజి నాయక్, మాజీ జెడ్పిటిసి వెంకటరమణ, మాజీ ఎంపీపీ వెంకటేష్, మాగే చెరువు సర్పంచి నరసింహలు, మండల ఉద్యోగులు సచివాలయ ఉద్యోగులు నాయకులు కార్యకర్తలు ప్రజల

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

పెనుకొండ : విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల లెక్చరర్ ఉమా శంకర్ తన తండ్రి బాబయ్య జ్ఞాపకార్థం నిర్మించిన భోజన శాలను మంత్రి సవిత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువులు క్రీడలు పట్ల శ్రద్ధ పెట్టాలని కోరారు. హై స్కూల్ గ్రౌండ్ అభివృద్ధి పనులు త్వరలోనే చేపడుతామని ఆమె తెలిపారు. అనంతరం లెక్చరర్ ఉమా శంకర్ దంపతులను మంత్రి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మునిమడుగు చిన్న వెంకట రాముడు, మాజీ ఎంపీపీ కేశవయ్య, పార్టీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ రెడ్డి, ఎంఇఒ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ధ్యేయం : కలెక్టర్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ టి.ఎస్.చేతన్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజల భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించిందని, రైతులు, బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూరల్ మండలంలోని గోళ్లాపురం పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన "మీ భూమి-మీ హక్కు" రెవెన్యూ సదస్సులను కలెక్టర్ ప్రారంభించారు. రెవెన్యూ సదస్సులపై ప్రజల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంపిన సందేశాన్ని మండల ప్రత్యేక అధికారి సోనీ సహాని చదివి వినిపించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. శతాబ్దం నాటి రెవెన్యూ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భూ సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందని కలెక్టర్ చెప్పారు. వీఆర్వోలు బాధ్యత లేకుండా పనిచేయడంతోనే భూ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. వీఆర్వోలు సక్రమంగా, క్రమశిక్షణతో పని చేస్తే ఎవరికి సమస్యలు ఉండవన్నారు. భూ సమస్యలతో ప్రజలు బాధపడుతున్నట్టు గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని ఆన్ లైన్ లో నమోదు చేస్తామన్నారు. మీ సమస్య పరిష్కరించడం జరిగిందా లేదా మీ సెల్ ఫోన్ కు ఖచ్చితంగా సందేశం అందజేయడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ రికార్డులు కోట్ల రూపాయల కంటే ఎంతో విలువైనవని కలెక్టర్ చెప్పారు. వాటిని భద్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. గ్రామ రెవెన్యూ అధికారులంతా రెవెన్యూ సదస్సులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. రీ సర్వే, అడంగల్‌లో చేర్పులు మార్పులు, సర్వే నంబర్లు తప్పుగా వేయడం, ఆర్ఎస్ఆర్ రికార్డులు, భూమి కొనుగోలు, విక్రయాల తదుపరి పేర్ల మార్పిడి, ఆక్రమణలు, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన వాటి వివరాలు తెలుసు కోవడానికి రెవిన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 56 సర్వీసులు ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. రెవిన్యూ యంత్రాంగమంతా గ్రామ ప్రజల వద్దకే వస్తుందని, రికార్డులన్నీ అందుబాటులో ఉంచుతారని వివరించారు. ప్రజలు నేరుగా వచ్చి తమ వినతిపత్రాల ద్వారా రికార్డులలో పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచి దేవరాజ్, మాజీ జడ్‌పిటిసి ఆదినారాయణ, హౌసింగ్ ఏఈ నారాయణరెడ్డి, తహశీల్దార్ వెంకటేశు, ఆర్ఐ అమరేంద్ర, మండల సర్వేయర్ సురేష్, పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప తో పాటు ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం : మంత్రి

రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే సింధూరరెడ్డి

ప్రజాశక్తి-కొత్త చెరువు

చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలు అందించి ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని మరోసారి నిరూపించు కుందని రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. ఐదెకరాల నిబంధనను పది ఎకరాలకు పెంచుతూ అతి త్వరలోనే సిఎం చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో శుక్రవారం వారు రైతులకు రాయితీపై డ్రిప్పు, స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. వారు మాట్లా డుతూ వైసిపి పాలనలో రైతులకు ప్రభుత్వం రాయితీతో ఎలాంటి వ్యవసాయ పరికరాలు ఇవ్వలేదని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే 90 శాతం సబ్సిడీతో రైతులకు డ్రిప్పు పరికరాలు అందించిందన్నారు. ఐదెకరాలు ఉన్న రైతులకు 50 శాతం రాయితీతో స్ప్రింకర్లు అందిస్తు న్నట్లు తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే నెల రోజుల్లోపు సంబంధిత కంపెనీ ద్వారా రైతు ఇంటి వద్దకు పరికరాలు పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3504 మంది, నియోజకవర్గంలో 525 మంది రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎంఐపి పిడి సుదర్శన్, ఏవో నటరాజ్, ఎపిఎంఐపి శాఖ ఇంజినీర్లు, టిడిపి మండల, టౌన్ కన్వీనర్లు రామకృష్ణ, వలిపి శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

ఎపిఎంఐపి పిడిపై మంత్రి ఆగ్రహం

డ్రిప్పు, ఇరిగేషన్ పరికరాల పంపిణీ నేపథ్యంలో మార్కెట్ యార్డ్‌లో ఏర్పాట్లపై మంత్రి సవిత అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఎపిఎంఐపి పిడి సుదర్శన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు పెద్ద ఎత్తున డ్రిప్పు, స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న విషయాన్ని రైతులకు తెలియజేయడంలో అధికారులు తీవ్రంగా విఫలమయ్యారని మండిపడ్డారు. భవిష్యత్తులో ఇలాగే పునరావృతమైతే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

భూ సమస్యలు లేని రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సిఎం చంద్రబాబు భూ తగాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పని చేస్తున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. మండలంలోని కొట్లపల్లి సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఆస్తులకు సంబంధించిన విషయాల్లో కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలు పూర్తిగా తగ్గిపోతున్నా యన్నారు. మానవ సంబం ధాలు దెబ్బతినకుండా ఉండాలనే ఉద్దేశంతో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీ ల్లో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపాలని ఓ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో భూ దందాలు, అరాచకాలు, దౌర్జన్యాలు పెట్రేగిపో యాయని, భూ రికార్డులు మాయమయ్యాయని తెలిపారు. అప్పటి సిఎం జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ వల్ల ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోయిందని, కూటమి అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేసిందన్నారు. ఆర్డీవో సువర్ణ మాట్లాడు తూ ప్రతి రైతు ఈ సదస్సుకు హాజరై తమ భూ సమస్యలను పరిష్కరించు కోవాలని సూచించారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సదస్సులో తహశీల్దార్ అను పమ, డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్, టిడిపి నాయకులు సామకోటి ఆది నారాయణ, పుల్లప్ప, వెంకటప్ప, పెద్దప్పయ్య, రామయ్య, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్ : మండలంలోని ఇరగంపల్లి సచివాలయం పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని తక్షణ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సదస్సులో మండల స్పెషల్ ఆఫీసర్ సోషల్ వెల్ఫేర్ డిడి శివరంగప్రసాద్, తహశీల్దార్ నీలకంఠారెడ్డి, సర్పంచి గంగరత్న, టిడిపి కన్వీనర్లు రామకృష్ణ, శ్రీనివాసులు, నాయకులు సామకోటి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండల కన్వీనర్‌కు పరామర్శ

బుక్కపట్నం : టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి తండ్రి కేశవరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సిద్దరాంపురం గ్రామం వెళ్లి కేశవరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వాటి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

సదస్సులో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రంగారెడ్డి

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని శెట్టిపల్లి గ్రామపంచాయతీలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి అధికారులను కోరారు. మండలంలోని శెట్టిపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సదస్సులో అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తహశీల్దార్ యూనస్ బాబు మాట్లాడుతూ ఇప్పటికే స్థలాన్ని పరిశీలించామని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అర్హులను గుర్తించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. రంగారెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి హైవే, సెజ్‌కి భూమి, ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. శెట్టిపల్లిలో అన్యాక్రాంతమైన భూము లను కాపాడాలని కోరారు. కోడూరు, కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలన్నారు. శ్మశాన వాటికలు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. సదస్సులో మొత్తం 58 అర్జీలు వచ్చాయని తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి అంజనప్ప, నాయకులు నందీశప్ప, అశ్వర్థప్ప, బయపరెడ్డి, విజయ్, మలిరెడ్డి, నారాయణస్వామి, జనసేన కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని బ్రాహ్మణపల్లి నూతన కాలనీలో శుక్రవారం పుట్టపర్తి పిహెచ్‌సి వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు వ్యక్తిగత, పరి సరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని సూచించారు. పౌష్టికాహా రం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వారంలో ఓ సారి డ్రైడే ఫ్రైడే పాటిస్తే దోమలు వృద్ధి చెంద వని, తద్వారా రోగాల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. అలాగే పలు ఆరోగ్య సూచనలు చేశారు. ధూమపానం, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నగేష్, రమణయ్య, ఆరోగ్య కార్యకర్త అనురాధ, ఆశా కార్యకర్తలు గులాబ్ జాన్, లక్షిదేవి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పరిటాల శ్రీరామ్ పూజలు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి విజయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో పంచలోహాలు కరిగించి భక్తుల సమక్షంలో అయ్యప్ప స్వామి విగ్రహాన్ని తయారు చేయిస్తున్నామని తెలిపారు. విగ్రహ తయారీలో వాడే పంచలోహ వస్తువులను పట్టణంలో భిక్షాటన ద్వారా ప్రజల నుంచి సేకరించానమన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, మాధవరెడ్డి, అంబటి సనత్, మహేష్‌చౌదరి, పాల్గొన్నారు.

విద్యార్థినులు మనోధైర్యంతో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి-తాడిమర్రి

విద్యార్థినులు విద్యతో పాటు క్రమశిక్షణతో మెలగుతూ మనోధైర్యంతో ముందుకెళ్లాలని సిఐ శ్యామ్‌రావు సూచించారు. స్థానిక కెజిబివిలో శుక్రవారం విద్యార్థినులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయగా సిఐ శ్యామ్‌రావు, ఎస్ఐ కృష్ణవేణి హాజరై విద్యార్థినులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వాణిశ్రీ, పోలీసులు విష్ణు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో విద్యార్థినులకు సలహాలు ఇస్తున్న సిఐ శ్యామ్‌రావు , ఎస్ఐ కృష్ణవేణి

బదిలీ పోలీసులకు సన్మానం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుళ్లు నరేష్, జనార్ధన్, మహేష్‌రెడ్డి మరో స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వారిని శుక్రవారం టౌన్ సిఐ శివరాముడు ఆధ్వర్యంలో సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఉపాధ్యాయుడి మృతి బాధాకరం

ప్రజాశక్తి-సోమందేపల్లి

అన్నమయ్య జిల్లాలో ఉపాధ్యాయుడు మృతి బాధాకరమని ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ శుక్రవారం ఎంఇఒలు ఆంజనేయులు నాయక్, ఆనంద్ బాబులకు వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా రక్షణ చట్టం తేవాలని, ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్షుడు చంద్ర, ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్‌టియు అధ్యక్షుడు సుధాకర్, నాగరాజు, రంగేష్ కుమార్, విజయ్ కుమార్‌నాయక్, ఇర్ఫాన్, ఉలవల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని కొండకమర్ల గ్రామంలో గురువారం రాత్రి పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, నల్లమాడ సిఐ నరేందర్ రెడ్డి, ఒడిసి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. వారు గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ముఖ్యంగా యువత అసాంఘిక కార్యకలపాల జోలికి వెళ్లవద్దని హెచ్చరించారు.

పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-తలుపుల

స్థానిక పిహెచ్‌సిని శుక్రవారం జిల్లా టాస్క్ ఫోర్స్ టీం, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ తనిఖీ చేశారు. అనంతరం పెద్దన్నవారిపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించి సిబ్బంది రికార్డులు, వైద్య సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఐఒ వైద్యాధికారి నాగేంద్ర, సిబ్బంది వీరమ్మ, బాబాఫక్రుద్దీన్, కళాధర్, నాగరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ రత్న

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో పోలీసులతో పాటు హోంగార్డుల సంక్షేమం కోసం పలు చర్యలు చేపట్టామని ఎస్పీ వి.రత్న తెలిపారు. హోంగార్డుల సేవలు మరువలేనివని, పోలీస్ వ్యవస్థకు మరింత మంచి పేరు తెచ్చే లా నడుచుకోవాలని సూచించారు. పట్టణంలోని జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం 62వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ వి.రత్నకు ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. ఎస్పీ ముందుగా సాయుధ హోం గార్డుల ప్లాటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పరేడ్ పరిశీలన వాహనంపై వెళ్లి ప్లాటూన్లను పరిశీలించారు. శాంతికి చిహ్నంగా పావురాలు ఎగురవేశారు. ఎస్పీ మాట్లాడుతూ హోం గార్డులు పోలీసుశాఖలో అంతర్భాగం అన్నారు. జిల్లాలో 301 మందికి గానూ 278 మంది పురుషులు, 23 మంది మహిళా హోంగార్డులు ఉన్నారన్నారు. వారికి ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అనంతరం స్పోర్ట్స్ మీట్ విజేతలకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజే శారు. ఆర్ఎస్ఐ వీరన్న, ప్లాటూన్ కమాండర్‌గా గోపాల్ నాయక్ వ్యవహరించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఎఆర్ ఆర్ఐలు మహేష్, వలి, రవి కుమార్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, వీరన్న, ప్రదీప్‌సింగ్, ఎఆర్ పోలీసులు, హోంగార్డులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ డీఎస్పీకి సన్మానం

బదిలీపై విశాఖపట్నంకు వెళ్తున్న ఎఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్‌ని జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు యంత్రాంగం ఘనంగా సత్కరించారు. ఎస్పీ వి.రత్న ముఖ్య అతిథిగా హాజరై ఆయన సేవలను కొనియాడారు. పూలమాలలు, శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఎఆర్ ఆర్ఐలు మహేష్, వలి, ఎఆర్ ఆర్ఎస్ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు, ప్రదీప్‌సింగ్, ఎఆర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ హోంగార్డుకు ప్రశంసా పత్రం

ముదిగుబ్బ : మండలంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ సరితాలబాషా పుట్టపర్తిలో ఎస్పీ రత్న, ఎఎస్పీ ఆర్ల శ్రీనివాసులు నుంచి ఉత్తమ హోంగార్డుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

రాజముద్రతో కొత్త పాసుపుస్తకాలు ఇస్తాం : ఎమ్మెల్యే రాజు

గ్రామ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి ప్రభుత్వం అహంకారంతో తమ బొమ్మలు ముద్రించి ఇచ్చిన రైతుల పట్టాదారు పాసు పుస్తకాలను రద్దు చేసి, రాజముద్రతో కొత్త పాసుపుస్తకాలు ఇచ్చే ప్రక్రియకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజ తెలిపారు. మండలంలోని ఛత్రం గ్రామంలో శుక్రవారం తహశీల్దార్ కరుణాకర్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై బాధితులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. వైసిపి పాలనలో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. మాజీ ఎమ్మెల్యే యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. దీంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా తమ చిన్నారికి నామకరణం చేయాలని దంపతులు ఎమ్మెల్యేని కోరగా ఆయన చిన్నారికి యశ్వంత్ రాణా అని పేరు పెట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు నాగరాజు, నరసేగౌడ్, పాండు, నంజుండ, శంకర, నాగేగౌడ్, కమలాకర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఫైర్

వైసిపి నాయకులు విజయసాయిరెడ్డి కేవలం కూటమి పార్టీల్లో ఐక్యత దెబ్బతీసేందుకే అలాంటి వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. ఎమ్మెల్యే పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కూటమి పార్టీలను విడదీయలేరన్నారు. వైసిపి నాయకులు కేవలం రాజకీయ ఉనికి కోసం కూటమి పార్టీలపై అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. జగన్, విజయసాయిరెడ్డి కచ్చితంగా జైలుకు పోతారని తెలిపారు.

అంబేద్కర్‌కు ఎమ్మెల్యే నివాళి

అసమానతలు లేని సమాజం కోసం అనునిత్యం పరితపించిన మహానేత డాక్టర్ బిఆర్. అంబేద్కర్ అని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు కొనియాడారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి పాల్గొన్నారు.

వైసిపి హయాంలో భూఅక్రమాలు : ఎమ్మెల్యే సునీత

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

వైసిపి హయాంలో చెన్నేకొత్తపల్లి మండలాన్ని భూ అక్రమాలకు కేంద్రంగా మార్చారని ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపడ్డారు. మండలం లోని కనుముక్కల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యేతో పాటు ఆర్డీఓ మహేష్, తహశీల్దార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే, అధికారులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూకబ్జాలపై వినతులు అందడంతో వాటిపై వెంటనే విచారణ చేయాలని ఆర్డీవో ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో ఎక్కువగా భూ అక్రమాలు జరిగాయన్నారు. ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చారని, ఇందులో విఆర్ఓ మహేశ్వర్‌రెడ్డి పాత్ర ఎక్కువగా ఉందన్నారు. గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలను అక్కడే పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. రెవెన్యూ సదస్సులో అందిన ప్రతి ఫిర్యాదును అధికారులు పరిష్కరించాలన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ విఆర్ఓ మహేశ్వర్‌రెడ్డిపై ఇప్పటికే పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయని, తహశీల్దార్‌తో విచారణ చేయించి కలెక్టర్‌కు నివేదిక పంపామన్నారు. కచ్చితంగా ఆయనపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

విద్యార్థుల సమస్యలపై చర్చించాలి : ఎస్ఎఫ్ఐ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని, అయితే ఈ సమావేశం సమస్యలపై చర్చించే వేదికగా ఉండాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి పేర్కొన్నారు. దీనిపై శుక్రవారం బిసి వసతి గృహం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి బాబావలి మాట్లాడారు. పాఠశాలల్లో నిర్వహించే తల్లి దండ్రుల సమావేశం పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, విద్యార్థులు విద్యాపరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించే విధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం నిర్వహించడం వలన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోను పూర్తి స్థాయిలో రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న నాడు-నేడు పనులు పూర్తి చేయాలని కోరారు. పాఠశాల అభివద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, హుస్సేన్, రాజు, హుసేన్, అఫ్రిద్, లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయునికి అవార్డు


వెంకటరత్నంను సన్మానిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

2024 గురుబ్రహ్మ మదర్ థెరెసా అవార్డుకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటరత్నం ఎంపికయ్యారు. వెంకటరత్నం విద్యారంగంలో చేసిన సేవలను గుర్తించి విశాఖపట్నంకు చెందిన ఓ ప్రయివేటు సంస్థ ఈ అవార్డుకు ఎంపిక చేసింది. దీంతో ఆయనను పాత్రికేయుడు శ్రీరాములు, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి జయకుమార్, శ్రీనివాసులు, డి.యుగంధర్ ఘనగా సన్మానించారు.

తపాలా సేవలపై ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని కదిరి సబ్ డివిజన్ తపాలా ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌నాయక్ తెలిపారు. తపాలా సేవలు, ఇన్సూరెన్స్, తదితర సేవలపై శుక్రవారం పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. గోవర్ధన్ నాయక్, నవీన్ కుమార్ మాట్లాడుతూ పోస్ట్‌ఆఫీస్‌లో అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుడిబండ : గ్రామీణ ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ జిలాన్‌బాషా కోరారు. స్థానిక తపాలా కార్యాలయం ఆవరణలో తపాల బీమా బ్యానర్‌ను పట్టుకొని తపాలా జీవిత బీమాపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్ మాస్టర్ తిమ్మరాజు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు.

నేడు పేరెంట్స్, టీచర్స్ సమావేశం

బుక్కపట్నం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ గోపాల్‌నాయక్ తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతులు, విద్యార్థుల స్థితిగతులు, హాజరుశాతం పెంపు, తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. సమావేశానికి హెచ్‌ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసి ఛైర్మన్లు హాజరై సలహాలు సూచనలు ఇవ్వాలని తెలిపారు.

బైక్ బోల్తా... యువకుడు మృతి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని బోయపల్లి క్వార్టర్స్ సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనం నుంచి అదుపుతప్పి బోల్తా పడడంతో తరుణ్‌సాయి(22) మృతి చెందాడు. తరుణ్‌సాయి తల్లి అనిత తెలిపిన వివరాలు.. కదిరి పట్టణంలోని నిజాంవలి కాలనీలో నివాసం ఉంటున్న తరుణ్‌సాయి రెండు రోజుల క్రితం బెంగ ళూరు నుంచి కదిరికి వచ్చాడు. స్నేహితుడు ఉమేష్‌ను గోరంట్లలో వదిలి వెళ్లడానికి వెళ్తూ తెల్లవారు జామున 3 గంటల సమయంలో కదిరి-హిందూపురం రోడ్డులో బోయపల్లి క్వార్టర్స్ సమీపంలో అతివేగంగా వెళ్తూ అదుపుతప్పి కింద పడ్డారు. తరుణ్‌సాయి తలకు బలమైన గాయం కావడంతో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతపురంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మృతిచెందాడు. అతడి తల్లి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి..

ప్రజాశక్తి-నల్లచెరువు

స్థానిక వేమనస్వామి ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న హరి కుమారుడు హరీష్(18) హైదరాబాద్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుండేవాడు. ఇటీవల ఇంటికి వచ్చాడు. ఇంట్లో శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు 108 సిబ్బంది తెలిపారు. దీంతో ఆ ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణ శివారులో శుక్రవారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో తాడిమర్రి మండలంలోని నాయన పల్లి గ్రామానికి చెందిన చిన్నబందు సాహెబ్, చంద్రశేఖర్ గాయపడ్డారు. వివరాలు.. వారిద్దరూ నాయనపల్లి నుంచి బైక్‌పై ధర్మవరం వస్తూ ఉండగా కదిరి గేట్ వైపు నుంచి బత్తలపల్లి వైపు వెళ్లే ఓ ట్రాక్టర్ స్థానిక చౌడేశ్వరి దేవాంగ కళ్యాణమండపం వద్ద యు టర్న్ తీసుకుంటూ వీరిని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం వారిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిద్దరూ చేనేత వృత్తిదారులు, అని తెలిసింది. ఈ ప్రమాదం పై పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణవేత్త గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జాతీయ పర్యావరణ అవార్డు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రెడ్డివారి శంకర్‌నారాయణ శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈయన మరణం సమాజానికి తీరని లోటు అని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల సంఘం అధ్యక్షులు బొల్లే ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లే వెంకటరత్నం తెలిపారు. వారు శంకర్‌నారాయణ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

CHANGE OF NAME

I have Changed my Name from **SUMA PRAKASH** (Old Name) to **SUMA.R** (New Name) Vide Affidavit Sworn before Mallikarjuna Advocate & Notary at Hindupur on 06th December 2024.

Address:8-144, SA.Quaters Kirikera, Hindupur, Sri Sathya Sai District.

అంబేద్కర్ ఆశయాలు ఆదర్శనీయం : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలు ఆదర్శనీయమని రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత కొనియాడారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ గొప్ప సంఘసంస్కర్త, విద్యావేత్త, ఆర్థికవేత్త అంబేద్కర్ అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల కన్వీనర్లు శ్రీరాములుయాదవ్, సిద్దయ్య, నాయకులు నారాయణస్వామి, కేశవయ్య, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, ప్రసాద్, షౌకత్, రామలింగ, చంద్రకాంతమ్మ, ఎనుమల రామకృష్ణ, హనుమంతు యాదవ్, అశ్వర్థ నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : దండోరా నాయకులు స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచి గంగాదేవి నరసింహమూర్తి, మాగే చెరువు సర్పంచి నరసింహులు, నాయకులు కిష్ట, సూర్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంగాధర్, జనసేన నాయకులు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : ఎస్సీ, ఎస్టీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎం.నరసింహులు, ఎం.కొండయ్య, దొడ్డప్ప, గోపాల్‌నాయక్, బాలకృష్ణనాయక్, ఆంజనేయులునాయక్, నాగరాజు, ఆటో యూనియన్ నాయకులు బాబు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : అంబేద్కర్ గారి విగ్రహానికి మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు అంబేద్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్లు రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, సాలెక్క గారి శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

తనకల్లు : స్థానిక బస్టాండ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి శివన్న, రైతు సంఘం నాయకులు రమణ, టిడిపి నాయకులు సోంపాల్యం నాగభూషణం, కాంగ్రెస్‌పార్టీ మండల కన్వీనర్ పారేసు చిన్నప్ప, సూర్యనారాయణ, శంకర్, చంద్రప్ప, జానకిరాం, మహబూబ్ బాషా,, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : ఎమ్మార్పీఎస్ నాయకులు బండారు పెద్ద ఓబులేసు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బండారు నాగభూషణ, బండారు రామాంజనేయులు, బిసాని లక్ష్మీనారాయణ, మీసాల కేశవరెడ్డి, ఎజె.చిన్న నరసింహులు, ఎజె. నరసిం హులు, గుజ్జల శ్రీనివాసులు, బండారు పెద్దిరాజు, గుజ్జల శేఖర్, మరువపల్లి లక్ష్మీనారాయణ(పతి), తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : అణగారిన, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ కొనియాడారు. పట్టణంలో పలుచోట్ల అంబేద్కర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్టిడి నరసింహులు, రామయ్య, నరసింహమూర్తి, అంజనప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో..

వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డిఎస్.కేశవరెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, వైస్ ఛైర్మన్ తిప్పన్న, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

ప్రశాంతి గ్రామ్‌లో..

మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్‌లో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విజయకుమార్ నాయక్, నాయకులు మోహన్‌నాయక్, నారాయణ స్వామినాయక్, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎద్దుల రాముడు, ఈశ్వరయ్య, ప్రకాష్, రవి, జివి.రమణ, సుబ్బన్న, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : స్థానిక అంబేద్కర్ విగ్రహానికి 'అందరివాడు ఉత్సవ సొసైటీ' ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె ధర్మవరం రెవెన్యూ డివిజన్ ఉపాధ్యక్షుడు రాచెర్ల రామకృష్ణ, జె.మురళి, ఆటో ముత్యాలప్ప, సివి.ప్రసాద్, గంగాధర, ఎట్టి ఓబుళపతి, దాసప్ప, ఎస్సీ కార్పొరేషన్ రామాంజనేయులు, విజయ్, చెంచుల ఓబులేసు, పూజారి గోవిందు, న్యామద్దెల లింగన్న, నాసప్పగారి నరసింహులు, దబ్బల శ్రీరాములు, ఎన్.సుబ్బరాయుడు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ఒక్కలిగ విభాగం అధ్యక్షులు గౌడవారి రంగేగౌడ్, జిల్లా కార్యదర్శి జిబి శివకుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : ఎస్సీ సంఘం నాయకుడు కిష్ట ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కిష్ట మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు.

ఓబుళదేవరచెరువు : స్థానిక అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ ఉద్యోగ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దేశానికి దశ, దిశ చూపించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తి ఆనంద్, లక్ష్మీపతి, కిష్టప్ప, నరసింహులు, సర్పంచి గోవిందు, రామాంజనేయులు, రామకృష్ణ, సిపిఎం నాయకులు వివి.రమణ, మండల కార్యదర్శి కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భావితరాలకు ఆదర్శప్రాయుడని పలువురు పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యలయంలో ఛైర్మన్ బలరామిరెడ్డి, వైస్ ఛైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బండి ఆనంద్ రాజు అధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, క్యాండిల్ వెలిగించి నివాళులు అర్పించారు. రాజకీయా పార్టీలు, ప్రజాసంఘాలు, కెవిపిఎస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



హిందూపురంలోని తహసీల్దార్ కార్యలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న రెవిన్యూ ఉద్యోగులు

మోటుకుపల్లి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహశీల్దార్ మురళీకృష్ణ

ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహశీల్దార్ మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని మోటుకుపల్లి పంచాయతీలోని కౌలేపల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ పోలప్ప మాట్లాడుతూ భూ సమస్యలు, వివాదాలు, ఇతర రెవెన్యూ సమస్యలు ఉన్న ప్రజలు అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సదస్సులో మండల సర్వేయర్ ప్రభంజన్‌రెడ్డి, ఎండోమెంట్ అధికారి రాజారెడ్డి, కదిరి సబ్ రిజిస్ట్రార్ కవిత, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండలంలోని గౌకనపల్లి పంచాయతీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ దేవేంద్రనాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

బుక్కపట్నం : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామ సదస్సులు నిర్వహిస్తుందని తహశీల్దార్ షాబుద్దీన్ తెలిపారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఇందులో తహశీల్దార్, అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సు తహశీల్దార్ నారాయణస్వామి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యలను 30 నుంచి 60 రోజుల్లో పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, టిడిపి నాయకులు రమేష్‌బాబు, తుమ్మల మనోహర్, ప్రకాష్ నాయుడు, తుమ్మల సూరి, తదితరులు పాల్గొన్నారు

లేపాక్షి : మండలంలోని మైదుగోళం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ కుమార్‌రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని సత్వరమే పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీలమ్మ, గ్రామ రెవెన్యూ అధికారి గంగరత్నమ్మ, సర్పంచి రామచంద్రారెడ్డి, ప్రజలు పాల్గొన్నారు .

రేపు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

2024-2025 విద్యా సంవత్సరానికి గానూ జాతీయ ఉపకార వేతనం(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్షను ఈ నెల 8వ తేదీ నిర్వహిస్తున్నట్లు డిఇఒ జి.కిష్టప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 2,334 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు తెలిపారు. హాల్ టికెట్లను www.bse.ap.gov.in, School U DISE CODE ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

తహశీల్దార్ వైఖరిపై నిరసన

ప్రజాశక్తి-గాండ్లపెంట

తహశీల్దార్ వైఖరి పట్ల శుక్రవారం స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఓ దళిత కుటుంబం నిరసన వ్యక్తం చేసింది. దళిత ఓబులేసు కుమారులు గంగాద్రి, వెంకటరమణ మాట్లాడు తూ గాండ్లపెంట రెవెన్యూ పొలంలోని 2.41 ఎకరాల ప్రభుత్వ భూమికి 1978లో ప్రభుత్వం తమ పూర్వీకులకు సాగు అనుమతి మంజూరు చేసిందన్నారు. మా నాన్న చనిపోవడంతో ఆ భూమిలో జెసిబితో పనులు చేస్తుంటే కొందరు పెత్తందారులు అడ్డుకుంటున్నారు. మా భూమిని మాకు అప్పగిం చాలని కోరుతున్నా తహశీల్దార్ స్పందించడం లేదని, దీంతో నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

దర్శినమలలో ప్రజా గ్రీవెన్స్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని దర్శినమల గ్రామ సచివాలయంలో శుక్రవారం మంత్రి సత్య కుమార్ యాదవ్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది 'గ్రీవెన్స్ డే' నిర్వహించారు. హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం హరీష్ బాబు స్థానిక పిహెచ్‌సిని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. జడ్పీ హైస్కూల్‌కు వెళ్లి పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. పరిసరాలను పరిశీలించారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న హరీష్‌బాబు

మాజీ ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు తగదు

ప్రజాశక్తి-మడకశిర

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిపై అసత్య ఆరోపణలు చేసిన ఎంపీటీసీ హనుమంతరాయప్ప బేషరతుగా క్షమాపణ కోరాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం సర్పంచి రంగనాథ్, వైసీపీ నాయకులు మంజునాథ్, అంజి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ ఎం.తిప్పేస్వామి మాజీమంత్రి రఘువీరారెడ్డి భూమిని కబ్జా చేశారని ఎంపిటిసి అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని, లేనిచో చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని పెడపల్లి ఉదయ్‌కిరణ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు మొక్కల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పర్యావరణవేత్త డాక్టర్ భాస్కరనాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. చెట్లు, అడవులను రక్షించుకుంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పెడపల్లి డాక్టర్ రాఘవేంద్ర, ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.

పోతన్న మృతదేహానికి పూలమాల వేస్తున్న వెంకటేశ్వరరావు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక గౌరాజుపల్లి గ్రామానికి చెందిన చాకలి పోతన్న శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు వారింటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు అందిం చారు. ఆయన వెంట నాయకులు మాధవ నాయుడు, హరీష్, బాబు, సురేష్, కార్యకర్తలు ఉన్నారు.